teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

10 రాష్ట్రాల్లో రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

మార్చి 16న పోలింగ్

నేటి నుంచే నామినేషన్ల పర్వం

మార్చి 5 వరకు గడువు

06

ములుగు | సంపుటి : 04 | సంచిక : 233 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 27 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## నగదు రహిత భారత్ దిశగా ఆర్బీఐ ముందడుగు

### డిజిటల్ వినియోగంపై భారీ ప్రోత్సాహకాలు




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): నగదు రహిత భారత్ లక్ష్యంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడుగులు వేస్తోంది. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ అయినటువంటి డిజిటల్ రూపాయి వినియోగాన్ని విస్తరించేందుకు కీలక చర్యలు చేపట్టింది. దేశ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా డిజిటల్ దిశగా తీసుకెళ్లడమే ఈ ప్రయత్నం వెనుక ప్రధాన ఉద్దేశ్యం అని ఆర్బీఐ పేర్కొంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కరెన్సీ

మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాల మధ్య తొలి హైటెక్ రహదారి

### మే నెలలో యాక్సెస్ కంట్రోల్ హైవే ప్రారంభం

### భారీగా తగ్గనున్న ప్రయాణ భారం




తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్. త్వరలో మరో కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించారు. ఈ నాలుగు లైన్ల హైవే పనులు ఇప్పటికే దాదాపుగా పూర్తి అవ్వగా.. మే నెలలో ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(చీనాూ×) సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఫీల్డ్ హైవే ఒక్కటి కూడా అందుబాటులో లేదు. దీంతో ఇదే తొలి రోడ్డుగా నిలవనుంది. ఈ రోడ్డు పొడవునా అత్యాధునిక

మిగతా 2 లో



# తెలంగాణ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

### 200 పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు సీఎం నిర్ణయం



### వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు

### 100 మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్

### నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుండి రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లోని 100 మండలాల్లో 200 పాఠశాలలను అత్యున్నత ప్రమాణాలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'గా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలోని బృందం సమర్పించిన 'తెలంగాణ విద్యా విధానం 2026: సమగ్ర విద్యా దృక్పథం' నివేదికపై

మిగతా 2 లో

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై సీఎం సీరియస్




- నిబంధనలు అతిక్రమిస్తే గుర్తింపు రద్దు
- ఫీజుల నియంత్రణకు పక్కా ప్లాన్
- ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ రూపురేఖలు
- విద్యార్థుల కోసం ఎలక్ట్రిక్ బస్సులు

## కాళేశ్వరం ఒక పేకమేడ

### కమిషన్ల కోసమే రీ-డిజైనింగ్

### బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. గురువారం ఆయన

మిగతా 2 లో



## నదుల అనుసంధానమే నా చిరకాల వాంఛ

### ఏపీ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు కీలక ప్రకటనలు

### వెలిగొండ ప్రాజెక్టుకు 14 వారాల డెడ్‌లైన్

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): గంగ-కావేరి నదుల అనుసంధానం తన చిరకాల కోరిక అని సీఎం చంద్రబాబు అన్నారు. గురువారం అసెంబ్లీలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయాంలో రెండోసారి పుష్కరాలు జరగబోతున్నాయని అన్నారు. అందుకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నదుల అనుసంధానం కోసం తాము ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. వంశధార నుంచి పెన్నా వరకు అనుసంధానం జరగాలని, అప్పుడే ఏపీలో నీటి సమస్య అన్నది

మిగతా 6 లో




## తెలంగాణలో పాలనా వేగం

### 99 రోజుల యాక్షన్ ప్లాన్ కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

### డిప్యూటీ సీఎం సారథ్యంలో కమిటీ

## తెలంగాణలో మూడో డిస్కమ్ ఏర్పాటు

- ఏప్రిల్ 1 నుండి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభం
- కొత్త డిస్కమ్ పరిధిలో 30 లక్షల సర్వీస్ కనెక్షన్లు
- సీఎండీగా ముషర్రఫ్ ఫారుఖీ నియామకం



.. వివరాలు 2లో

## ఖమ్మం బాధితులకు కేటీఆర్ భరోసా

### "న్యాయం జరిగే వరకు పోరాడుతాం"

### ప్రభుత్వ తీరుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

### ఉచిత న్యాయ సహాయం.. ఇళ్ల స్థలాల హామీ



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ గురువారం పరిశీలించారు. బాధితులను కేటీఆర్ పరామర్శించి, మాట్లాడారు. వచ్చే నెల 16వ తేదీ నుంచి

మిగతా 2 లో

## తెలంగాణ జర్నలిస్టులకు ఊరట

- ఏప్రిల్ 30 వరకు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు
- జీఓ 252, 103 లపై ప్రభుత్వ వివరణ కోరిన న్యాయస్థానం
- న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: జర్నలిస్ట్ ఫెడరేషన్

.. వివరాలు 2లో

# తెలంగాణ విద్యా వ్యవస్థలో "విప్లవాత్మక మార్పులు"

మొదటి పేజీ తరువాయి

చర్చించిన అనంతరం ముఖ్యమంత్రి ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ నూతన విధానం కింద, ఎంపిక చేసిన పాఠశాలల్లో నర్సరీ నుండి 12వ తరగతి వరకు పూర్తిస్థాయి విద్యను అందించనున్నారు. వీటికి అవసరమైన బడ్జెట్‌ను రాబోయే ఆర్థిక సంవత్సరంలో కేటాయించనున్నట్లు సీఎం హామీ ఇచ్చారు.

**విద్యా కమిషన్ సిఫార్సులు:**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2000 పాఠశాలలను అత్యాధునిక ల్యాబ్‌లు, లైబ్రరీలు, క్రీడా సదుపాయాలతో అభివృద్ధి చేయాలని కమిషన్ ప్రతిపాదించింది. ప్రతి పాఠశాలకు సుమారు 1500 మంది విద్యార్థుల సామర్థ్యం ఉండేలా చూస్తూ, చుట్టుపక్కల గ్రామాల నుండి విద్యార్థులను తీసుకురావడానికి ప్రత్యేక స్కూల్ బస్సు నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రీస్కూల్ నుండి యూనివర్సిటీ విద్య వరకు, అలాగే ఓపెన్ లెర్నింగ్, సాంకేతిక విద్య, పాలనా సంస్కరణలపై 12 అధ్యాయాలతో కూడిన సమగ్ర నివేదికను కమిషన్ రూపొందించింది.

**14 నెలల కసరత్తు.. అధ్యయనం**

ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, డాక్టర్ చరకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి గారు గత 14 నెలలుగా ఈ నివేదికపై విస్తృత



కసరత్తు చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 305 విద్యాసంస్థలను సందర్శించారు. పంజాబ్, హర్యానా, కేరళ వంటి రాష్ట్రాలతో పాటు మలేషియా, వియత్నాం, అమెరికా వంటి దేశాల్లోని ప్రభుత్వ పాఠశాలల పనితీరును అధ్యయనం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, గ్లోబల్ ఎక్స్‌పర్ట్స్‌తో కలిపి మొత్తం 54 సమావేశాలు, 10 సెమినార్లు నిర్వహించి ఈ ముసాయిదాను సిద్ధం చేశారు. ఈ సరికొత్త విద్యా విధానం ద్వారా తెలంగాణ పిల్లలకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై "సీఎం సీరియస్"

హైదరాబాద్, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలు అతిక్రమించి ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల అనుమతి రద్దుతో పాటు ఆ ఫీజు రికవరీ చేసేలా నిబంధన విధించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం విద్యాశాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ రీజియన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని సూచించారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్స్‌లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలన్నారు.



**విద్యార్థుల ట్రాన్స్‌పోర్టు కోసం ఎలక్ట్రిక్ బస్సులు**

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, తప్పని సరిగా పాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం విజయ డైరీ నుంచి పాలు సేకరించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాలలో పైలట్ ప్రాజెక్ట్ కింద తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా రూపుదిద్దుకుంటున్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల తరహాలో ట్రాన్స్‌పోర్టుతో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్టు కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటుపైన అధ్యయనం చేయాలని సూచించారు.

# ఖమ్మం బాధితులకు కేటీఆర్ భరోసా

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ ప్రారంభమవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను శాసనసభలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగే వరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు.

**ఇళ్లు కట్టిస్తాం**

తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని మాజీమంత్రి కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు.

**అన్యాయం చేయలేదు**

కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని మాజీమంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని మీ అందరికీ అదే ప్రాంతంలో, అక్కడే ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.





# తెలుగు రాష్ట్రాల మధ్య తొలి హైటెక్ రహదారి

మొదటి పేజీ తరువాయి

టెక్నాలజీ కూడిన వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. అందుకే దీనిని హైటెక్ హైవేగా పిలుస్తున్నారు.

**ప్రత్యేకతలు:**

దారి పొడవునా ఎక్కడికక్కడ భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు

సమాచారాన్ని అందించేందుకు దారి పొడవునా పలు ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉంటాయి

ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్స్ ఏర్పాటు చేశారు

ప్రమాణించిన దూరానికి మాత్రమే టోల్ ఛార్జీ వసూలు టెక్నాలజీ ఏర్పాటు

పరిమిత సంఖ్యలో ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలు ఉంటాయి

అత్యాధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేశారు

సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు

టెక్నాలజీతో కూడిన సేవలు అందుబాటులో ఉంటాయి.

**తగ్గనున్న 50 కిలోమీటర్లు:**

తెలంగాణలోని ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు 162 కిలోమీటర్ల మేర ఈ యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మించారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లేవారికి ఈ రోడ్డు వల్ల ఏకంగా 56 కిలోమీటర్ల ప్రయాణ సమయం తగ్గనుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే సూర్యాపేట, విజయవాడ మీదుగా 676 కిలోమీటర్ల మేర దూరం వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఈ కొత్త నేషనల్ హైవే వల్ల 56 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఎన్‌హెచ్-365బీజీ నెంబర్‌ను ఈ కొత్త జాతీయ రహదారికి ఇప్పటికే కేటాయించారు. ఖమ్మం సమీపంలోని తల్లంపాడు నుంచి ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా దేవరపల్లి వరకు ఈ హైవే ఉంటుంది. తెలుగు రాష్ట్రాలను కలిపే తొలి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఫీల్డ్ హైవేగా ఇది నిలవనుంది. 9 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలు అందుబాటులో ఉంటాయి. దీంతో వేగంగా ప్రయాణం చేయవచ్చు. ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువగా ఉండదు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో విశాఖ వైపు తరచూ వేల మంది వెళ్తూ ఉంటారు. అలాంటివారికి దీని వల్ల ప్రయోజనం కలగనుంది.

# నగదు రహిత భారత్ దిశగా ఆర్బీఐ ముందడుగు

మొదటి పేజీ తరువాయి




వినియోగాన్ని తగ్గించి, సురక్షితమైన, పారదర్శకమైన లావాదేవీల వైపు ప్రజలను మళ్లించాలని ఆర్బీఐ లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ రూపాయి అంటే మన చేతిలో ఉండే కరెన్సీ నోట్లు, నాణేల మాదిరిగానే ప్రభుత్వ గుర్తింపు పొందిన అధికారిక డిజిటల్ కరెన్సీ. ఇది వాలెట్ ఆధారిత వ్యవస్థలో పనిచేస్తుంది. యూపీఐ ద్వారా మనం బ్యాంకు ఖాతా నుండి డబ్బు బదిలీ చేస్తాము. కానీ డిజిటల్ రూపాయిలో ఆర్బీఐ జారీ చేసిన డిజిటల్ నోట్లు నేరుగా ఒక డిజిటల్ వాలెట్ నుండి మరొక వాలెట్‌కు మారుతాయి. అంటే ఇది కేవలం చెల్లింపు పద్ధతి కాదు, స్వయంగా డబ్బే. రిటైల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఆర్బీఐ, బ్యాంకులు కలిసి పలు ప్రోత్సాహకాలు ప్రకటించాయి. డిజిటల్ పద్ధతి ద్వారా కిరాణా దుకాణం, షాపింగ్ మాల్, ఇతర రిటైల్ స్టోర్లలో చేసే చెల్లింపులపై వినియోగదారులకు 1% నుంచి 2% వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ ఇవ్వనున్నారు. చిన్న వ్యాపారులు డిజిటల్ మనీ స్వీకరిస్తే ఎటువంటి ట్రాన్సాక్షన్ ఫీజులు ఉండవు. అంతేకాకుండా నెలకు నిర్దిష్ట పరిమితికి మించి డిజిటల్ లావాదేవీలు నిర్వహించే వ్యాపారులకు ట్యాక్స్ రాయితీలు, తక్కువ వడ్డీ రేటుతో రుణాలు అందించే ప్రణాళికలను కూడా బ్యాంకులు సిద్ధం చేస్తున్నాయి. ఆర్బీఐ తీసుకురానున్న మరో ముఖ్యమైన ఫీచర్ ఆఫ్‌లైన్ చెల్లింపులు. ఇంటర్నెట్ లేకపోయినా, సిగ్నల్ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో కూడా 'ట్యాప్ అండ్ పే' సదుపాయం ద్వారా డిజిటల్ మనీని ఉపయోగించవచ్చు. ఇది చిన్న కిరాణా దుకాణాలు, బస్సులు, మెట్రో స్టేషన్లు వంటి ప్రదేశాల్లో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టడానికి కారణం ఫిజికల్ కరెన్సీ ముద్రణ, రవాణా ఖర్చులు భారీగా ఉండటమే. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో నగదు నిర్వహణ వ్యయం ఎక్కువగా ఉంటుంది. డిజిటల్ రూపాయి వినియోగం పెరిగితే కరెన్సీ ముద్రణ, భద్రత, రవాణా వంటి ఖర్చులు తగ్గుతాయి. అలాగే నకిలీ నోట్ల సమస్య కూడా పూర్తిగా తగ్గుతుంది. ప్రతి లావాదేవీ డిజిటల్‌గా నమోదవడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ఆర్థిక నేరాలు తగ్గుతాయి. బ్యాంకింగ్ సర్వర్లపై ఒత్తిడి కూడా తగ్గి, వేగంగా చెల్లింపులు పూర్తవుతాయి. యూపీఐకి ఇది పోటీ కాదని ఆర్బీఐ స్పష్టం చేసింది. యూపీఐ ఒక చెల్లింపు వేదిక కాగా, డిజిటల్ రూపాయి స్వయంగా డబ్బు. భవిష్యత్తులో యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారానే డిజిటల్ రూపాయి చెల్లింపులు చేసేలా సాంకేతిక సమన్వయం ఇప్పటికే జరుగుతోంది. 2026 చివరి నాటికి పట్టణ ప్రాంతాల్లో కనీసం 50% నగదు లావాదేవీలను డిజిటల్ రూపాయిలోకి మార్చడమే లక్ష్యంగా ఈ విస్తరణ కొనసాగుతోంది. "జేబులో నోట్ల కంటే మొబైల్‌లో డిజిటల్ మనీ సురక్షితం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆర్బీఐ పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేపడుతోంది.

# కాళేశ్వరం ఒక పేకమేడ

మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అవినీతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే కట్టారని పొంగులేటి ఆరోపించారు. 38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి, తమ రాచరికాన్ని చాటుకోవడం కోసం లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించారు. తీరా చూస్తే ఎన్నికల ముందు ఆ ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయింది అని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో 162 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే, అందులో 50 టీఎంసీలు తిరిగి సముద్రం పాలయ్యాయని ఆయన గణాంకాలతో వివరించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినప్పటికీ, బీఆర్ఎస్ , బీజేపీల మధ్య ఉన్న అంతర్గత ఫెవికల్ బంధం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి ఆరోపించారు. కేంద్ర సంస్థల నివేదికల ఆధారంగానే తాము జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కానీ దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగే సమయంలో ప్రతిపక్ష సభ్యులు పారిపోయారని దుయ్యబట్టారు. సభలో చర్చకు రమ్మంటే కుంటిసాకులు చెప్పే బావబావమరుదులు (కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను ఉద్దేశించి), బయట మాత్రం అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారు అని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. నిత్యం పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ, శవాల మీద చిల్లర ఏరుకునే రకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని చూశారు కాబట్టే అన్ని ఎన్నికల్లో ఓడగొట్టారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంత నీటిని నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ వాసులకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ స్వార్థ నిర్ణయాల వల్ల రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి పోయిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పనులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్షం దమ్ముంటే అసెంబ్లీకి రావాలని ఆయన సవాల్ విసిరారు.

# తెలంగాణలో పాలనా వేగం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో పాలన మరింత సమర్థంగా సాగేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ శాఖల్లో అమలు చేయాల్సిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక (99 డేస్ యాక్షన్ ప్లాన్) రూపొందించి అమలు చేయడానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేసి అమలు దిశగా అడుగులు వేయనుంది. ఈ సబ్ కమిటీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీ సభ్యులుగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

**త్వరలో కమిటీ సమావేశం**

ఈ కమిటీకి ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి ఆర్థిక శాఖతో పాటు సంబంధిత శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు కమిటీ సమావేశాలకు హాజరవుతారు. రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రజలకు ఇచ్చిన హామీలను కాలపరిమితిలో అమలు చేయడం లక్ష్యంగా ఈ 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అత్యంత ప్రాధాన్యతతో రూపొందించి, వేగంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే కమిటీ సమావేశమై అన్ని శాఖలతో సమీక్ష జరిపి వివరమైన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయనుంది.

# తెలంగాణలో మూడో డిస్కమ్ ఏర్పాటు

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఏప్రిల్ 1 నుంచి మూడో డిస్కమ్‌ను ప్రభుత్వం ప్రారంభించనుంది. సుమారు 30 లక్షల సర్వీస్ కనెక్షన్లతో కొత్త డిస్కమ్ ఏర్పాటు చేసింది. వ్యవసాయ ఉచిత విద్యుత్, మెట్రో వాటర్ బోర్డు, లిఫ్ట్ ఇరిగేషన్ సరఫరా కొత్త డిస్కమ్‌కు బదిలీ చేసింది. 2,000 మంది ఇంజినీర్లు, సిబ్బంది బదిలీకి ప్రణాళిక సిద్ధం చేసింది. మూడో డిస్కమ్ సీఎండీగా ముషర్రఫ్ ఫారుఖీని నియమించింది. పవర్ అంబులెన్స్‌లతో వేగవంతమైన అవుటేజ్ పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. ఫీడర్ అవుటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రియల్ టైమ్ మానిటరింగ్ ఏర్పాటు చేశారు.

# పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాయాలి



రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): విద్యార్థులు మానసిక ఒత్తిడి, భయం వీడి ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలకు హాజరుకావాలని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం స్టాన్లీ బాలికల పాఠశాల ఆడిటోరియంలో విద్యాశాఖ, సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షల సన్నద్ధత పై ప్రేరణాత్మక శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరితో కలసి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులలో మానసిక ఒత్తిడి భయాందోళన తగ్గుతుందని మోటివేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై జిల్లా కలెక్టర్ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు బిడియం, భయం అలాగే మానసిక ఒత్తిడి లేకుండా ఉండాలని సంకల్ప్ పౌండేషన్ సహకారంతో మోటివేషన్ క్లాస్ లు ఏర్పాటు చేసి విద్యార్థులను భయమును తొలగించడం అభినందనీయమని మంత్రి అన్నారు. విద్యార్థులకు పదవ తరగతి జీవితంలో కీలక మెట్టు అని,మీ జీవితం పదవ తరగతి పరీక్షల పై ఆధారపడి ఉందని అన్నారు. విద్యార్థులు సంవత్సర కాలం పాటు ఎంతో శ్రమతో చదవడం అలాగే ఉపాధ్యాయులు మంచి విద్యాబోధన అందించటం జరిగిందని అన్నారు. విద్యార్థులు భయం వీడి చదివిన దానిని పరీక్షల్లో ప్రశాంతంగా సమాధానాలు రాయాలని సూచించారు. సివిల్స్ కి వెళ్లాలన్న పదవ తరగతి మార్కులు ఎన్ని వచ్చాయి అని ముందు అడగడం జరుగుతుందని అన్నారు. పదవ తరగతి సిలబస్ డిసెంబర్ మాసానికి పూర్తి చేయటంతో విద్యార్థులు రివిజన్ పై ఎక్కువ దృష్టి పెట్టి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సిలబస్ అనంతరం ప్రాక్టీస్ చాలా ముఖ్యమైందని అలాగే నేను, ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని వచ్చామని దానికి మూలం చదివేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని మోటివేషన్ ద్వారా పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్ జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని నేటి విద్యార్థులు రేపటి పౌరులని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువును ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయవద్దని బాధ్యతతో చదవాలని, అప్పుడే తల్లిదండ్రులు మీ గ్రామం, మీ స్నేహితులు సంతోషిస్తారని మంత్రి తెలిపారు. మీరు భవిష్యత్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. పరీక్షల సమయం దగ్గరగా ఉండటంతో విద్యార్థులు చదివింది మరోసారి చదవండి.. జ్ఞాపక శక్తిని మరింతగా పెంచుకోవాలని అన్నారు. అలాగే పరీక్షల సమయంలో టీవీలు, స్నేహితులు, సీరియల్ లకు దూరంగా ఉండాలని సూచించారు. పరీక్షల రోజులలో ముందు ప్రశ్నాపత్రం బాగా చదవాలి. అప్పుడు ప్రశ్నపత్రంలో ముందుగా మీకు సులువుగా వచ్చే సమాధానాలు రాయాలని, హార్డ్ గా ఉన్న ప్రశ్నలకు ఆలోచిస్తే మీకు సమాధానాలు అవే వస్తాయని అన్నారు. పదవ తరగతి పరీక్షలు కేవలం ఒక పరీక్ష మాత్రమే కాదు ఇది మీ భవిష్యత్తు పునాది వేయబోయే మొదటి పెద్ద అడుగు అని అన్నారు. సంకల్పం అనే పట్టుదలతో విద్యార్థుల ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతిరోజూ టైమ్‌టేబుల్ ప్రకారం విద్యార్థులు చదువుకోవాలని అలాగే ముఖ్యమైన అంశాలను రివిజన్ చేయాలని సూచించారు. భయం వీడి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి,సరైన నిద్ర, సరైన ఆహారం తీసుకోవాలని సూచించారు. మీ తల్లిదండ్రుల ఆశలు, గురువుల మార్గదర్శకత్వం, మీ కృషి ఇవన్నీ కలిసి మీ విజయానికి దారి చూపిస్తాయనీ అన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం మీలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు. అలాగే అందరికీ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విజయం కలగాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. అంతకుముందు నూరు శాతం అటెండెన్స్ ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులకు సన్మానం, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అమౌంట్ తో పాటు నగదు బహుమతి అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో రోహిణి, యువ క్రీడాకారిణి నైనా జైస్వాల్,సంకల్ప్ పౌండేషన్ ప్రతినిధి రోజి , మోటివేషన్ స్పీకర్స్ , ప్రధానోపాధ్యాయులు, హైదరాబాద్ జిల్లాలోని పలు పాఠశాల పదవ తరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 2971.20 కోట్లు రుణాలు అందించడం లక్ష్యం

లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగాలకు 2971.20 కోట్లు రుణాలు అందించడం లక్ష్యం కాగా డిసెంబర్ మాసం నాటికి 1937.21 కోట్ల రుణాలు అందించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కన్సల్టేటివ్, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ మరియు జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు కార్యాచరణ తయారు చేయాలని సూచించారు. రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో పంట రుణాలు, ఎం.ఎస్.ఎం.ఈ, హౌసింగ్, విద్య, వ్యవసాయ రుణాలను సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు అందించాలని అన్నారు. ఆయా బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న యూనిట్లను బ్యాంకు అధికారులను సంప్రదించి రుణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్దిదారులకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులు బ్యాంకర్లు నీడలా చేయొద్దని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అదే విధంగా కోళ్ల ఫారాలు నెలకొల్పుకునేందుకు సెరికల్చర్ చేపట్టేందుకు అధిక మెత్తంలో రుణాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రాధాన్యతా రంగాలకు సకాలంలో రుణాలు అందిచాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. పంట రుణాలు చెల్లించిన రైతులకు తిరిగి రెన్యూవల్ చేయడం లేదని, ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయాన్ని ఆపుతున్నారని అన్నారు. రెన్యూవల్ కాకుండా ఇబ్బందులు పడే 100 మంది రైతులను చూపిస్తానని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రుణాలు చెల్లించని వారికి అవగాహన కల్పించి వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కానీ ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. బ్యాంకర్లు రుణాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణితో ప్రజలు, రైతులతో మంచిగా ఉండాలని, అపుడే లావాదేవీలు బాగా జరుగుతాయని స్పష్టం చేశారు. మొండి కేసులు వివరాలు నాకు చెప్పండి నేను వసూలు చేసే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా రిలేషన్ మెయింటైన్ చేయాలని సూచించారు. కొంతమంది బ్యాంకర్ల వల్ల మంచి రైతులు సైతం ఇబ్బంది పడుతున్నారని సక్రమంగా చెల్లించని వారు మంచిగా రుణాలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో డైరీ యూనిట్ కు మంచి అవకాశం ఉందని, డైరీ యూనిట్ ఎర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ఆర్.బి.ఐ. ఎల్.డి.ఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, యూబీఐ డిజిఎం, టిజిబి ఆర్ ఎం, ఎల్.డి.ఎం. ఎ.తిరుపతి, జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



హనుమకొండ, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): గురువారం 16వ డివిజన్ జాన్‌పాకలో పరిధిలోని గోల్డెన్ విల్లా రిసార్ట్ లో సంగెం, గీసుగోండ మరియు 15, 16, 17 డివిజన్లకు చెందిన 50 మంది మైనార్టీ మహిళలకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కుట్టు మిషన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకంలో భాగంగా పరకాల నియోజకవర్గంలో అర్హులైన మహిళలకు కుట్టు మిషన్ లను పంపిణీ చేయడం జరిగిందని ఇందులో సంగెం, గీసుగొండ మండలాల్లోని, బల్దియా పరిధి లోని 16 ,17 డివిజన్ల కు చెందిన మొత్తం 50 మంది లబ్ధిదారులకు అందజేశామని అన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కుట్టు మిషన్లు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తాయని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుంది అన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వంట సిబ్బంది పరిశుభ్రతను పాటించడంతో పాటు, ఆహార పదార్థాలు తాజావిగా ఉండేలా చూడాలని, గడువు ముగిసిన పదార్థాలను వినియోగించొద్దని ఆదేశించారు. భోజనం బావుంది ప్రతి రోజు ఇలానే చేయాలని వంట సిబ్బందిని అభినందించారు. పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తరచుగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు మంచి అలవాట్లు అలవరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, భద్రతా పరమైన చర్యలపై దృష్టి సారించాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రహరీ గోడ పైభాగంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ జీవరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు

మండల, మున్సిపాలిటీ కమిటీ నియామకం



మద్దూర్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశాను సారం మద్దూర్ మండల కేంద్రంలో ఆర్టీఐ పిసి రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ పాల్గొని, మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో సెక్షన్ 6(1) ప్రకారం దరఖాస్తు చేస్తే అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ కాలయాపన చేస్తూ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం లేకుండా పోయిందని అన్నారు.అలాగే నారాయణపేట అసెంబ్లీ యూత్ కన్వీనర్ గా వెంకటేష్, మద్దూర్ మండల అధ్యక్షుడిగా చిన్న నరసింహులు, ఉపాధ్యక్షులు గా రవీందర్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగేష్ ని నియమించడం జరిగింది. ఈ సమావేశంలో అసెంబ్లీ ఇంచార్జీ గణేష్,యూత్ కన్వీనర్ రమేష్,వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పలువురికి నాగులమ్మ జాతర ఆహ్వాన పత్రిక అందజేసిన ట్రస్ట్ చైర్మన్



మంగపేట, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట (లక్ష్మి నర్సాపురం ) గ్రామం లో ఈ మర్చి 3-03-26 నుండి 07-03-26 వరకు జరిగే నాగులమ్మ జాతరకు రావలసిందిగా లక్ష్మణు బాబుకి ఆహ్వాన పత్రిక ఇచ్చి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాకుల మర్రి ప్రదీప్ రావు, తాటి కృష్ణ మండల మాజీ పాక్స్ వైస్ చైర్మన్ కడబోయిన నరేందర్, చిట్టిమల్ల సమ్మయ్య, సిద్ధం శెట్టి లక్ష్మణు రావు, యలవర్తి శ్రీనివాస్, పూజారి శ్రీను, నరేందర్, కమలాపురం గ్రామ అధ్యక్షులు తుక్కని శ్రీను, రమేష్, మహేష్ పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

**అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

**గోదావరి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి**

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



తాడ్వాయి, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించే విధంగా సిద్ధం చేయాలని, జిల్లాలో వివిధ శాఖల లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క సారలమ్మ వన దేవతలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రాలతో కలిసి మేడారం లోని హరిత హోటల్ లో మేడారం మాస్టర్ ప్లాన్, జంపన్న వాగు అభివృద్ధి పనులు, ఇందిరమ్మ నిర్మాణం, గోదావరి పుష్కరాల నిర్వహణ, వేసవికాలంలో త్రాగునీటి సరఫరా, సెంట్రల్ లైటింగ్, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, పలు అభివృద్ధి పనులపై జిల్లాస్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులతో గృహ ప్రవేశాలు నిర్వహించాలని అన్నారు. అదే విదంగా పూ-ర్తయిన ఇండ్లకు డబ్బులు చెల్లించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మేడారంలో మరిన్ని శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని, భక్తులకు ప్రశాంతమైన దర్శనం కల్పించే విధంగా గద్దెల చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, ఆదివాసి పూజారులతో సమావేశాలు నిర్వహించి వారి సూచన సలహాలు మేరకు పటిష్టమైన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, మేడారం రహదారుల డివైడర్ మధ్య భాగంలో ప్లాంటేషన్ చేయాలని అన్నారు. అదేవిధంగా

జంపన్న వాగులో నిరంతరం నీరు ప్రవహించేలా చూడడం కోసం జంపన్న వాగుపై చెక్ డ్యామ్ ల నిర్మాణం కోసం నిపుణులతో సర్వే నిర్వహించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో పెండింగ్ పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమగ్నం కావాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పలు అంశాలు అన్ని సిద్ధం చేసుకోవాలని ఈ మూడు నెలలు వేసవి కాలంలో త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ నిధులను పకడ్బందీగా ప్రజల అభివృద్ధి కోసం వెచ్చించాలని, ములుగు జిల్లా కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించే విధంగా అభివృద్ధి పరచాలని అన్నారు. వచ్చే ఏడాది 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్ ల వద్ద ప్రజల సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సదుపాయాలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గోదావరి పుష్కరాలకు ఈ ఘాట్ వద్ద భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, షామియానాలు వంటివి పక్కాగా అందుబాటులో ఉండాలన్నారు. భక్తులకు పూర్తి స్థాయిలో పటిష్ట

భద్రత కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కర ఘాట్ వద్ద మెట్లు, ఘాట్ వంటి వాటికి అవసరమైన మేర మరమ్మతులు చేయించాలని అన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని, హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని, రహదారికి మరమ్మతులు జరిపించాలని మంత్రి ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం జిల్లాలో నాలుగు పుష్కర ఘాట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు పకడ్బందీ ప్రణాళికలతో ప్రతి ఒక్కరికి త్రాగునీరు అందించే విధంగా చూడాలని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ లో కూలీల సంఖ్య పెరిగే విధంగా చూడాలని ఈ పథకం ద్వారా గ్రామానికి అవసరం అయ్యే పనులను ఎంపిక చేయాలన్నారు. అంతకుముందు మంత్రి సీతక్క ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని హరిత హోటల్ లో ఎస్ ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి / షాది ముభారక్ చెక్కులను దివాకర టి. ఎస్., ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా లతో కలిసి పంపిణీ చేశారు. ఏటూరు నాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్న చిత్ర మిశ్రా ఐఏఎస్ ను రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా ప్రమోట్ చేస్తూ బదిలీ ఉత్తర్వులు వచ్చిన సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ సునీత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్‌లో పాఠశాలల ఎంపికకై దరఖాస్తులు స్వీకరణ

మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): 2026-27 విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్ ఒ నాన్- రెసిడెన్షియల్) పథకం లో బాగంగా, ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయడానికి మహబూబాబాద్ జిల్లాలోని (ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల నుండి దరఖాస్తులను ఆహ్వానించనైనది.



**అర్హతలు:**

1) ఆ పాఠశాల జిల్లా విద్యా అధికారి / పాఠశాల విద్యా డైరెక్టర్ ద్వారా గుర్తింపు పొంది ,దానికి మేనేజింగ్ కమిటీ ఉండాలి.

2) గత ఐదు సంవత్సరాలలో పాఠశాలలో 7వ మరియు10వ తరగతి పరీక్షలలో 90% కంటే ఎక్కువ ఉత్తీర్ణత ఉండాలి.

3) ఈ పాఠశాల నివాస సౌకర్యాన్ని కలిగి ఆహారం, నివాసం, ఎస్సీలు మరియు ఎస్సీయేతరుల మధ్య వివక్షత లేకుండా ఎస్సీ విద్యార్థులకు భోజన మరియు వసతి సౌకర్యాలు ఉండాలి.

4) విద్యా శాఖ ప్రకారం పాఠశాలలో తగినంత మంది అర్హత కలిగిన ఉపాధ్యాయులు కనీసం 50% బోధనా సిబ్బంది (3) సంవత్సరాలకు పైగా సంస్థలో పనిచేస్తున్న శాశ్వత సిబ్బంది అయి ఉండాలి.


5) ఈ పథకం కింద మునుపటి సంవత్సరాల్లో చేరిన ఎస్సీ విద్యార్థులలో కనీసం 50% మంది 7, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో మొదటి తరగతిలో ఉత్తీర్ణతులై ఉండాలి . ఇందుకుగాను, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రెసిడెన్షియల్ పథకం భాగంగా 5వ తరగతి విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, బోజన వసతితో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మరియు నోట్ పుస్తకములకు గాను ప్రతి విద్యార్థికి రూ.42,000/- చొప్పున చెల్లించబడును. మరియు బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ (నాన్- రెసిడెన్షియల్) పథకం లో బాగంగా 1వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ తో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మరియు నోట్ పుస్తకములకు గాను ప్రతి విద్యార్థికి రూ.28,000/- చొప్పున చెల్లించబడును. ఇట్టి దరఖాస్తు ఫారాముల కొరకు షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ మహబూబాబాద్ జిల్లా సమీకృత కార్యాలయం రెండవ అంతస్తు (రూమ్. నెం.ఎా-17) నందు 27-02-2026 నుండి ప్రతి పని దినములలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు దరఖాస్తు ఫారములు ఇవ్వబడును మరియు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలు తేది: 25-03-2026 సాయంత్రం 5.00 గంటల వరకు మాత్రమే ఈ కార్యాలయం నందు స్వీకరించబడును. కావున మహబూబాబాద్ జిల్లాలోని అర్హత కలిగిన స్కూల్ యాజమాన్యాలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, మహబూబాబాద్ కె. శ్రీనివాసరావు తెలియజేశారు.

# ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం గీసుగొండ మండలంలోని ఎంపీపీఎస్ ధర్మారం పాఠశాలను సందర్శించారు. ఫౌండేషనల్ లీటరసీ, న్యూమరసీ కార్యక్రమం అమలు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 2వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న గణిత పరీక్షను పరిశీలించి, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను అంచనా వేస్తున్న విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను ఆప్ లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో అవసరమైన మూలాధార నైపుణ్యాలను పూర్తిగా సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నేర్చుకునే ప్రక్రియను ఆసక్తికరంగా మరియు ఫలప్రదంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రగతిని నిరంతరం ట్రాక్ చేస్తూ, అవసరమైన అకాడమిక్ సహాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బి. రంగయ్య నాయుడు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ మరియు ఎంఈఓ రవీందర్ పాల్గొన్నారు.



# మంత్రి సీతక్కని సన్మానించిన గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్



ములుగు జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): దశాబ్దాల తమ చిరకాల కోరికను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు ఉద్యోగులు పెన్షనర్లకు 1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపజేయడంతోపాటు ఉద్యోగులకు పెన్షనర్స్ కు ఆరోగ్య పథకాన్ని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేయడం పట్లకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడారంలో దానసరి అనసూయ సీతక్కని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు పెద్ద సంఖ్యలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య భీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు 1998 వ్యాధులకు నగదు రహిత చికిత్సను పొందే విధంగా అవకాశం లభించడం నిజంగా వరమని ఇట్టి బిల్లు జారీ చేయడంతో పాటు క్యాబినెట్ సమావేశంలో పలు సానుకూల నిర్ణయాలను తీసుకోవడం తో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని మరోసారి తెలియజేశారు అని ములుగు జిల్లా అధ్యక్షులు ఎం.సంపత్ రావు అన్నారు. అలాగే మంత్రి సీతక్క చేతుల మీదుగా మహిళా దినోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏం సంపత్ రావుతో పాటు సెక్రెటరీ కందుల జీవన్ కుమార్ మరియు రాష్ట్ర జిల్లా నాయకులు ప్రకాష్ రెడ్డికే కొమరయ్య దీప రెడ్డి ఎం రాజు రఫిక్ రాజేశ్వరరావు డి రాజు ప్రేమలత సునీత రహీం అహ్మద్, యశ్వంత్, దేవేందర్ రావు మొదలగు నాయకులు మరియు గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ దిశా దశ చైతన్య యాత్ర

**33 జిల్లాల్లో తిరగనున్న చైతన్య రథం**



మెదక్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం అంతారం గ్రామంలో ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండి కొండోజు నరసింహ చారి ఆధ్వర్యంలో విశ్వకర్మ దిశా దశ చైతన్య యాత్ర కార్యక్రమశీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, రాష్ట్ర మనుమయ సంఘం అధ్యక్షులు సుంకోజు కృష్ణమాచారి, చిలిప్ చెడు ఎస్ఐ నర్సింలు, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వాన్ని సృష్టించిన విశ్వకర్మలు కొన్ని వందల సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు గతంలో ఎంతోమంది నాయకులు, విశ్వకర్మ పెద్దలు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఏనాడు వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. విశ్వకర్మ జాతిలో ఎంతోమంది పెద్దలు రాష్ట్ర నాయకులు ఉన్న జాతికి మెలు చేసేవారు కొందరే అన్నారు. ఆ కొందరిలో ఒకరే కొండోజు నరసింహ చారి అని కొనియాడారు. విశ్వకర్మ జాతి కోసం గత పదిహేళ్ళుగా ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ప్రారంభించి విశ్వకర్మ జాతీయుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఇలాంటి వారు మన జాతిలో జన్మించడం విశ్వకర్మ జాతి చేసుకున్న అదృష్టమని అన్నారు. అనంతరం కొండోజు నరసింహ చారి, మాట్లాడుతూ విశ్వకర్మ జాతి కోసం విశ్వకర్మ దిశ దశ చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇట్టి చైతన్య యాత్ర ని 33 జిల్లాల్లో తిప్పుతూ ప్రతి జిల్లాలో విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. 411 యాక్టులో సవరణ జరిగే వరకూ ఫారెస్ట్ అధికారులతో వడ్రంగి సోదరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వరకు విశ్వకర్మ దిశ దశ చైతన్యయాత్ర కొనసాగుతూనే ఉంటుందన్నారు. స్వర్ణకారుల వద్ద ఎక్కడైనా అక్రమ దొంగ బంగారం కొన్నారంటూ పోలీసులు భయభ్రాంతులకు గురిచేసి రికవరీలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ దిశా దశ చైతన్య యాత్ర రాష్ట్ర యువజన అధ్యక్షులు అనంతోజు నాగరాజు చారి, గంధాల శ్రీనివాస్ చారి, మేడోజు రామరాజు చారి, బిచ్కుంద స్వర్ణకార సంఘం అధ్యక్షులు కృష్ణ చారి, సుంకోజు రమేష్ చారి, కరుణాకర్ చారి, నరేందర్ చారి, సంగమేశ్వర్ చారి, శివ కుమార్ చారి, కమ్మరి కిష్టయ్య చారి, నిరంజన్ చారి, విరాట్ చారి, గోవింద్ చారి,తో పాటు గ్రామ ప్రజలు పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 3డీ ప్రింటింగ్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఐటిఐ, ఏటీసీలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 కింద త్రిడీ ప్రింటింగ్ కోర్సులో 20 మంది విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుండి ఉచిత శిక్షణకు దరఖాస్తులు కోరబడుచున్నామని ప్రభుత్వ ఐటిఐ ఏటీసీ ప్రిన్సిపాల్ ఎన్. బాబు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల శిక్షణ కొరకు తేదీ.04.03.2026 నుండి నూతనంగా నిర్మించబడిన ఏటీసీ నందు అదునాతన మిషనరీ లో శిక్షణ ఇవ్వబడునని ఆసక్తి గల నిరుద్యోగ యువతి, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీసీ 344137 క్రింద 3ఐ ప్రింటింగ్ ఆపరేటర్ కోర్సు ప్రవేశాలు కలవని శిక్షణ సమయంలో బయోమెట్రిక్ హాజరు ఖచ్చితంగా ఉంటుందని కోర్సు పూర్తయిన తర్వాత అసెస్మెంట్ నిర్వహించి ప్రభుత్వ పాస్ సర్టిఫికెట్ అందజేయబడుతుందని అన్నారు ఇందుకు కావాల్సిన ఎస్ఎస్సి సర్టిఫికెట్ ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ మరియు వ్యక్తిగత ఈమెయిల్ ఐడితో కార్యాలయాన్ని సంప్రదించగలరని అన్నారు. 3ఐ ప్రింటింగ్ టెక్నాలజీ లో నైపుణ్యం మరియు స్వయం ఉపాధి కోసం రుణ సదుపాయాల అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కోర్సు ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవడం మరియు స్వయం ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. ఇతర వివరాల కొరకు కార్యాలయం లో సంప్రదించగలరని అన్నారు.

# జిల్లా నూతన కలెక్టర్‌గా సందీప్ కుమార్ ఝా



జనగామ జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ, కుత్బుల్లాపూర్, జోనల్ కమిషనర్ (2014 కేడర్ ఐఏఎస్ అధికారి) సందీప్ కుమార్ ఝా నూతన కలెక్టర్‌గా నియమితులయ్యారు. జనగామ జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా గురువారం మధ్యాహ్నం బాధ్యతలను స్వీకరించారు.

# జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ గా చాహత్ బాజ్ పాయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ ను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, పలువురు జిల్లా అధికారులు, తహసిల్దార్లు నూతన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి అదనపు కలెక్టర్, అధికారులు ఘనంగా స్వాగతం పలికి పూల మొక్కలు పుష్పగుచ్చాలను అందించారు. జిల్లా కలెక్టర్ గా కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పని చేసిన స్నేహ శబరిష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు కలెక్టర్ గా వెళ్ళగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా ఉన్న చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.

# బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత కల్పిస్తూ బ్యాంకర్లు ముందుకు సాగాలన్నారు. గ్రామాలలోని నిరుపేద కుటుంబాలకు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి ఎదుగుదలకు గాను సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని బ్యాంకర్లకు సూచించారు. నూతనంగా ఏర్పడే మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను అందించడానికి వారికి నూతన ఖాతాలను తెరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 60 సంవత్సరాలు నిండిన మహిళ వయోవృద్ధులతో ఏర్పాటు చేస్తున్న సంఘాలకు నూతన ఖాతాలు అందించడం వారికి అనుగుణంగా రుణ సహాయాలు అందించడానికి బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి మరియు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వ పథకాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి నియమ నిబంధనల ప్రకారం రుణాలు అందించే విధంగా చూడాలని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్, లీడ్ బ్యాంకు మేనేజర్ జయప్రకాష్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఆర్.బి.ఐ ఏజీఎం యశ్వంత్ సాయి,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కమలాకర్ లతో కలిసి 2026-27 ఆర్థిక సంవత్సర ప్రొటెక్షన్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బుక్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ధర్మ నాయక్, మత్స్య సంవర్ధక శాఖ సాల్మన్ రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, అడిషనల్ డిఆర్డిఏ శ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్మీడియట్ ద్వితీయ భాషా పరీక్ష

**జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు--మార్చి 2026లో భాగంగా గురువారం నిర్వహించిన ద్వితీయ భాషా (తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, జీఎఫ్సీ) థియరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా సాధారణ విభాగంలో 6,743 మంది, వృత్తి విద్యా విభాగంలో 1,895 మంది విద్యార్థులు కలిపి మొత్తం 8,638 మంది విద్యార్థులకు ఉండగా , అందులో సాధారణ విభాగంలో 6,622 మంది, వృత్తి విద్యా విభాగంలో 1,822 మంది కలిపి మొత్తం 8,444 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు. సాధారణ విభాగంలో 121 మంది, వృత్తి విద్యా విభాగంలో 73 మంది కలిపి మొత్తం 194 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నమోదు చేయబడినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు, తదుపరి రోజు పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు, ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు క్రమబద్ధంగా నిర్వహించబడినట్లు తెలిపారు.

# మహిళ సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



గోవిందరావుపేట, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): మహిళ సాధికారతకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మహిళలకు అన్ని రంగాలలో అభివృద్ధిలోకి తీసుకురావడానికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నామని, కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేస్తున్నామని, వయో వృద్ధులకు భరోసా కల్పించడం కోసం 60 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ప్రత్యేక మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం గోవిందరావుపేట మండలం పసర గ్రామంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క పంచాయతీరాజ్ శాఖ ద్వారా 10 లక్షల రూపాయల నిధులతో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా గ్రామ సంఘాల భవనాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాల ఉన్నతి తెలంగాణ ప్రగతి అనే లక్ష్యంతో మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పథం లోకి తీసుకురావడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తున్నామని ఈ పథకం ద్వారా అనేకమంది మహిళలు వివిధ వ్యాపార రంగాలలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాలలో ఉండే మహిళా సంఘాలు సమావేశాలకు నిర్వహించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో వారికి శాశ్వత భవనాలు నిర్మించాలని దానిలో భాగంగానే జిల్లాకు దాదాపు 42 శాశ్వత భవనాలు మంజూరు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. మేడారం శ్రీ సమ్మక్క సారమ్మ మహా జాతరలో మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, వీటి ద్వారా వారికి రెట్టింపు ఆదాయం లభించిందని, మహిళలు స్వశక్తితో ఎదగడానికి వారికి సకాలంలో వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి ఆర్థిక అభివృద్ధికి పాటుపడడం జరుగుతుందని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు నిండిన మహిళలకు కూడా ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేయడమే కాకుండా సంఘంలోని సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయలు ఆర్థిక బీమా కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నేర పరిశోధనలో పోలీస్ జాగిలాల పాత్ర కీలకం

**పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్**

**నూతనంగా చేరిన బైరవ్, విరాట్ పోలీస్ జాగిలాలు**

**ఎనిమిది నెలలు శిక్షణ కాలాన్ని పూర్తి చేసిన జాగిలాలు**

**ఉత్తమ ప్రతిభ కబనబరిచిన జాగిలానికి బంగారు పతకం**



వరంగల్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): నేర పరిశోధనలో పోలీస్ జాగిలాలు కీలకంగా నిలుస్తాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఎనిమిది నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న బీగల్ జాతి చెందిన బైరవ్, విరాట్ జాగిలాలు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తమ సేవలందించేందుకు నూతనంగా విధుల్లోకి చేరిన నూతన పోలీస్ జాగిలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పోలీస్ జాగిలాల హ్యాండ్లర్లు కుమార స్వామి (బైరవ్ హ్యాండ్లర్), సాంబయ్య (విరాట్ హ్యాండ్లర్) లను జాగిలాల పనితీరును అడిగితెలుసుకున్నారు. అనంతరం శిక్షణ కాలంలో జాగిలాలకు నిర్వహించిన క్లిష్టతరమైన పరీక్షల్లో ఉత్తమంగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించిన బైరవ్ జాగిలానికి సిపి మెడల్ అలంకరించి హ్యాండ్లర్లను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ నూతన జాగిలాలు పేలుడు పదార్థాలను సులభంగా పసిగడతాయని. ఈ శునకాలు చూడటానికి చిన్న ఆకారంలో వున్నా పెద్ద జాగిలాలు వెళ్ళలేని ప్రదేశాలు, మార్గాల్లో ఈ జాగిలాలు వెళ్ళి పేలుడు పదార్థాలను గుర్తుస్తాయని, ముఖ్యంగా విమానాల్లో ప్రయాణికుల సామాను భద్రపర్చే క్యాబిన్లల్లో కార్ల క్రిందకు వెళ్ళి పేలుడు పదార్థాలను గుర్తించడం ఈ జాగిలాల ప్రత్యేకతని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా ఈ పోలీస్ జాగిలాల ద్వారా గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నో కేసుల్లో నిందితులను గుర్తించడంతో పాటు మత్తు పదార్థాలను గుర్తించడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు శ్రీనివాస్, రవి, ఏసిపి సురేంద్ర, ఆపరేషన్స్ ఆర్.ఐ సింహాచలం శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ ఇంచార్జ్ ప్రభాకర్ లు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో జ్యూట్ బ్యాగ్ తయారీపై శిక్షణ కార్యక్రమం

**సర్టిఫికేట్ల పంపిణీ**




జనగామ జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): జనగామ జిల్లా కేంద్రంలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఎం ఎస్ ఎం ఈ, డి ఎఫ్ ఓ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు జ్యూట్ బ్యాగ్ తయారీపై ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులకు శిక్షణ పూర్తి చేసిన అనంతరం సర్టిఫికేట్లను ఘనంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దశరథ్ (ఆణ, ఎం ఎస్ ఎం ఈ డి ఎఫ్ ఓ), మూర్తి (లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్), హర్షవర్ధన్ (ఆణ, వీజూహీూ), జుణజ మేనేజర్ సతీష్ , జ్యూట్ బ్యాగ్ చీ+ూ ప్రతినిధి వరలక్ష్మీ మరియు ట్రైనర్ వసంత హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పర్యావరణానికి హితమైన జ్యూట్ బ్యాగ్ తయారీపై ఇలాంటి నైపుణ్య శిక్షణలు యువత మరియు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను పెంచుతాయని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో జ్యూట్ ఉత్పత్తుల పాత్ర ఎంతో కీలకమని, భవిష్యత్తులో జ్యూట్ ఆధారిత ఉత్పత్తులకు మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో పాల్గొన్న అభ్యర్థులకు జ్యూట్ బ్యాగ్ తయారీకి సంబంధించిన ప్రాథమిక మరియు ప్రాయోగిక నైపుణ్యాలు, ముడి పదార్థాల ఎంపిక, డిజైన్, కుట్టు పద్ధతులు, నాణ్యత ప్రమాణాలు మరియు మార్కెటింగ్ అంశాలపై సమగ్రంగా శిక్షణ అందించబడింది. శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధి ప్రారంభించడానికి అవసరమైన అవగాహన మరియు నైపుణ్యాలను సంపాదించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న శిక్షణార్థులకు సర్టిఫికేట్లు అందజేయడంతో పాటు, భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం జనగామ జిల్లాలో నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల పెంపుకు దోహదపడేలా విజయవంతంగా నిర్వహించబడింది.

# మెగా టెక్స్టైల్ పార్క్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

గీసుగొండ, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పలు శాఖల అధికారులతో కలిసి సందర్శించి, పార్క్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్‌లో రహదారుల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జ్, బ్రిడ్జ్ పనులు, గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నుండి టెక్స్టైల్ పార్క్‌కు రహదారి మార్గం ఏర్పాటు, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి తదితర మౌలిక సదుపాయాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల నాణ్యత, వేగం, సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్క్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తైతే పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మౌలిక సదుపాయాల అభివృద్ధిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, జిల్లా పరిశ్రమల మేనేజర్ స్వామి, ఆర్ ఒ బి శాఖ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ ప్రతినిధులు, తహసీల్దార్లు రాజ్‌కుమార్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారులకు ఊరట

**ఎనిమిది వారాల్లోపు స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలి**

**హైకోర్టు సంచలన తీర్పు**

**ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**





హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): ప్రజా పాలన ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి త్వరలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయనుందని తెలిపారు. మినిస్టర్ క్వార్టర్స్ లో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్, కోదండరాం, తెలంగాణ ఉద్యమకారులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కమిటీకి సంబంధించిన విధి విధానాలు ఉద్యమకారుల హామీలు తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్, కోదండరాం, ఉద్యమకారులు చర్చించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం కాబోతున్నారు.

**హైకోర్టు తీర్పు నేపథ్యంలో:**

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభయహస్తం పథకం కింద ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, నెలకు సుమారు రూ.25వేల పెన్షన్, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు పెన్షన్లు, ఇండ్ల స్థలాలు కల్పించాలన్న హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ ఉద్యమ జేఏసీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఉద్యమకారులు దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు గత సోమవారం విచారణ జరిపింది. అభయహస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన తెలంగాణ ఉద్యమకారులకు ఎనిమిది వారాల్లోపు ఇండ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు ఫ్రీడమ్ ఫైటర్ శాఖ అధికారులకు జస్టిస్ విజయసేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. అర్హతల పరిశీలనలో ఆలస్యం చేయకుండా, విధివిధానాల ప్రకారం కేసులను పరిష్కరించి ప్రయోజనాలు అందించాల్సిందిగా స్పష్టం చేసింది.

# జిల్లా నూతన కలెక్టర్‌గా అంకిత్ ఐఏఎస్ బాధ్యతలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా అంకిత్, ఐఏఎస్ గురువారం సాయంత్రం 06:19 గంటలకు ఐడీఓసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సదర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిఎండి జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ మరియు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను నూతన కలెక్టర్‌కు పరిచయం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పని చేసే అవకాశం లభించడం తనకు గౌరవంగా మరియు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకత, ప్రజాహితం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతమైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం వంటి అంశాల్లో సమగ్రంగా ముందుకు సాగాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు భద్రాచలం పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో జరిగింది. జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్‌ను ఇల్లందు క్రాస్ రోడ్‌లో గల సింగరేణి గెస్ట్ హౌస్ వద్ద కొత్తగూడెం ఆర్డీవో మధు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఐడీఓసి కార్యాలయానికి చేరుకుని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లో 100 మిలియన్ల ఫాలోవర్ల మైలురాయి

**ప్రధాని సరికొత్త ప్రపంచ రికార్డు**

**ఈ ఘనత సాధించిన తొలి ప్రపంచ నాయకుడు**

**అమెరికా అధ్యక్షుడి కంటే రెండింతలు ఎక్కువ**




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో 100 మిలియన్ల మంది ఫాలోవర్ల చారిత్రాత్మక మైలురాయిని అధిగమించారు, ఈ వేదికపై ఈ ఘనత సాధించిన తొలి ప్రపంచ నాయకుడు మరియు రాజకీయ నాయకుడిగా నిలిచారు. ప్రధాని మోడీ 2014లో ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. ఆయనకు ఇన్‌స్టాగ్రామ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే రెండు రెట్లు ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు.

తదుపరి ఐదుగురు ప్రధాన ప్రపంచ నాయకుల మొత్తం అనుచరుల సంఖ్య ప్రధాని మోడీ వ్యక్తిగత అనుచరుల సంఖ్య కంటే తక్కువ. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 43.2 మిలియన్ల మంది అనుచరులతో రెండవ స్థానంలో ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో మిస్టర్ మోడీ ఇతర భారతీయ రాజకీయ నాయకుల కంటే మైళ్ల ముందున్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాదాపు 16.1 మిలియన్ల మంది అనుచరులతో రెండవ స్థానంలో ఉన్నారు.

# 10 రాష్ట్రాల్లో రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): 10 రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం నుండి మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. వచ్చే నెల 16న పోలింగ్ జరుగుతుంది. మహారాష్ట్రలో ఏడు స్థానాలు, తమిళనాడులో ఆరు స్థానాలు, బీహార్ మరియు పశ్చిమ బెంగాల్‌లో ఐదు స్థానాలు, ఒడిశాలో నాలుగు స్థానాలు, అస్సాంలో మూడు స్థానాలు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మరియు హర్యానాలో రెండు స్థానాలు మరియు హిమాచల్ ప్రదేశ్‌లో ఒక స్థానం ఖాళీగా ఉన్నాయి. ఏప్రిల్‌లో ఎగువ సభలో పదవీకాలం పూర్తి చేసుకుంటున్న వారిలో కేంద్ర మంత్రులు రామ్‌నాథ్ ఠాకూర్, రామ్‌దాస్ అథవాలే, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, ఎన్‌సిపి-ఎస్పీ నాయకుడు శరద్ పవార్, ఆర్‌ఎల్‌ఎం నాయకుడు ఉపేంద్ర కుష్వాహా, కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి, ఎఐఎడిఎంకె నాయకుడు ఎం తంబిదురై, డిఎంకె నాయకుడు తిరుచ్చి శివ ఉన్నారు. బ్యాలెట్ పేపర్‌పై ప్రాధాన్యతలను గుర్తించడానికి రిటర్నింగ్ అధికారి అందించిన ముందస్తుగా నిర్ణయించిన స్పెసిఫికేషన్‌తో కూడిన ఇంటిగ్రేటెడ్ వైలెట్-రంగు స్కెచ్ పెన్నులను మాత్రమే ఉపయోగించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. రాజ్యసభ ఎన్నికలలో ప్రాధాన్యతలను గుర్తించడానికి వేరే ఏ పెన్నును ఉపయోగించరాదని పేర్కొంది.

# నదుల అనుసంధానమే నా చిరకాల వాంఛ

మొదటి పేజీ తరువాయి

లేకుండా పోతుందని అన్నారు. నదులను అనుసంధానం చేసిన తెలుగు తల్లికి జలహారతి ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ. 20 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రాయలసీమ రాళ్లసీమగా మారకుండా దిశానిర్దేశం చేసిన వ్యక్తి ఒక్క ఎన్టీఆరేనని అన్నారు. గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభించారని గుర్తు చేశారు. రాయలసీమకు నీళ్లు ఇచ్చిన తర్వాతే చెన్నైకి నీళ్లు తరలించారని పేర్కొన్నారు. ఏపీలోని ప్రాజెక్టులన్నీ నాడు ఎన్డీయే, ఎన్టీఆర్ హయాంలోనే పూర్తయ్యాయని సీఎం చంద్రబాబు అన్నారు.

**వెలిగొండకు 14 వారాల డెడ్‌లైన్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని సీఎం చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని తానే పూర్తి చేయబోతున్నానని స్పష్టం చేశారు. జూలైలో వెలిగొండ ఫేజ్-1 నుంచి నీళ్లు రాబోతున్నాయని తెలిపారు. రూ. 2,500 కోట్ల పనులు పెండింగ్‌లో పెట్టి, 'జాతికి అంకితం' అంటూ గత పాలకులు హడావుడి చేశారని సెటైర్లు వేశారు. పట్టిసీమతో నీళ్లు తెచ్చి కృష్ణా డెల్టాకు అందించామన్నారు. అదేవిధంగా శ్రీశైలం నుంచి రాయలసీమకు నీళ్లు ఇచ్చామన్నారు. వెలిగొండకు 14 వారాల డెడ్‌లైన్ పెట్టామని, ఆ ప్రాజెక్టుపై ప్రతి వారం రిపోర్టు పరిశీలిస్తానని సీఎం తెలిపారు. ఉత్తరాంధ్రలో 11 ప్రాజెక్టులను ఈ టర్మ్‌లో పూర్తి చేస్తానని చెప్పారు.

**ఈ అవకాశం మళ్లీ రాదు**

పోలవరం ప్రాజెక్టును పుష్కరాల కంటే ముందే ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టును ఎమ్మెల్యేలంతా పరిశీలించాలని సూచించారు. మళ్లీ ఇలాంటి అద్భుతమైన అవకాశం రాదని అన్నారు. 66 ప్రాజెక్టులు ఈ రోజుకీ నీటితో కళకళలాడుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు.

**పోలవరం-నల్లమల సాగర్‌తో ఎవరికీ నష్టం లేదు.**


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదని సీఎం చంద్రబాబు అన్నారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీటినే తాము ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును గోదావరిపైనే కట్టారని, తాను ఏనాడూ అభ్యంతరం చెప్పలేదన్నారు. నల్లమల సాగర్‌తో తెలుగు రాష్ట్రాలకు లాభం తప్ప నష్టం లేనేలేదని అన్నారు. తాము కాళేశ్వరానికి అభ్యంతరం చెప్పలేదని తెలంగాణ వాళ్లు కూడా నల్లమల సాగర్‌కు అభ్యంతరం చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని నీళ్లు ఉంటే అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని అన్నారు. టైమ్ బౌండ్ ప్రోగ్రామ్ పెట్టుకుని నదుల అనుసంధానంపై ముందుకెళ్తామని సీఎం చంద్రబాబు అన్నారు.

# అర్ధరాత్రి వేళ "ఆసిఫాబాద్ లో" కంపించిన భూమి

**కుమ్రంభీం జిల్లాలో స్వల్ప భూకంపం**

**భయాందోళనలో ప్రజలు**

**నిద్రలో ఉండటంతో ఆలస్యంగా వెలుగులోకి**






ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ డివిజన్ లో స్వల్ప భూకంపం జనాలను భయాందోళనకు గురిచేసింది. కౌటాల, బెజ్జూర్, పెంచికల్ పేట్ ప్రాంతాల్లో బుధవారం (ఫిబ్రవరి 25) అర్ధరాత్రి మూడు సెకన్ల పాటు భూమి కంపించింది. రాత్రి 11.49 నిమిషాల సమయంలో మూడు సెకన్ల పాటు భూకంపం వచ్చింది. ప్రజలు అర్ధ రాత్రి వేళ నిద్రలో ఉన్న సమయం కావడంతో దీన్ని పెద్దగా గుర్తించలేదు. కొందరు మాత్రం భూమి కంపించిన విషయాన్ని గుర్తించి ఇండ్ల నుంచి బయటకు వచ్చి చూశారు. ఉదయం ఈ విషయం ఒకరికొనరు అడిగి నిర్ధారించుకున్నారు. రిక్టర్ స్కేల్ పై దీని తీవ్రత 3.9గా నమోదు అయింది. ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలుగలేదు.

# తెలంగాణలో వరుణుడి పలకరింపు


**నేడు పలు జిల్లాల్లో వర్ష సూచన**

**ఓవైపు వర్షాలు.. ఖమ్మంలో మాత్రం 34.4°C ఉష్ణోగ్రత**



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో 4 సెం.మీ, మహబూబాబాద్ జిల్లా గూడూరు వర్గల్‌లో 2 సెం.మీ, కొత్తగూడెం 1 సెం.మీ చొప్పున వర్షాపాతం నమోదైంది. అలాగే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 34.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

# తెలంగాణ జర్నలిస్టులకు ఊరట




హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్ కార్డు నిబంధనల మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌లో, జీఓ 252, సవరించిన జీఓ 103 వల్ల జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

**న్యాయం కోసం పోరాటం ఆగదు**

ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అలాగే, జీఓ 252, సవరించిన జీఓ 103పై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తిస్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటేషన్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని పేర్కొంది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ ముహియుద్దీన్ అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడగింపును స్వాగతిస్తూ, ఇది తాత్కాలిక ఊరట మాత్రమేనని, జర్నలిస్టులకు న్యాయం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# జింబాబ్వేపై భారత్ భారీ విజయం

## సమిష్టిగా బాదిన బ్యాటర్లు
## అభిషేక్, హార్దిక్ అర్ధ శతకాలు
## బెన్నెట్ పోరాటం వృథా





**చెన్నై:** బ్యాటర్లు రాణించడంతో.. టీ20 వరల్డ్‌కప్ సెమీస్ ఆశలను భారత్ సజీవంగా నిలబెట్టుకొంది. సూపర్-8లో భాగంగా గురువారం గ్రూప్-1లో జరిగిన కీలక మ్యాచ్‌లో టీమిండియా 72 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 256/4 స్కోరు చేసింది. అభిషేక్ శర్మ (30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 55), హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50 నాటౌట్) హాఫ్ సెంచరీలు సాధించగా.. తిలక్ వర్మ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 44 నాటౌట్) సత్తాచాటాడు. సికందర్ రజా, ముజరబాని, ఎన్‌గరవ తలో వికెట్ పడగొట్టారు. ఛేదనలో జింబాబ్వే ఓవర్లన్నీ ఆడి 184/6 స్కోరు చేసింది. బ్రియాన్ బెన్నెట్ (97 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అర్ష్‌దీప్ 3 వికెట్లు పడగొట్టాడు. ఈ ఓటమితో నాకౌట్ రేసు నుంచి జింబాబ్వే అవుటైంది. కాగా, సెమీస్ బెర్త్ కోసం ఆదివారం జరిగే బంపర్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. పాండ్యా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

### ముందుగానే వదిలేశారు..

భారీ లక్ష్యాన్ని జింబాబ్వే ఏదశలోనూ ఛేదించే విధంగా కనిపించలేదు. బెన్నెట్ భారీ అర్ధ శతకంతో రాణించినా.. విజయం కోసం తెగించలేక పోయాడు. సగం ఓవర్లు ముగిసే సరికి రన్‌రేట్ 20కిపైగా చేరుకోవడంతో.. జింబాబ్వే ఓటమి లాంఛనమేనని అర్థమైంది. ఓపెనర్లు బెన్నెట్, మరుమణి జట్టుకు నిలకడైన ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరూ వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరుబోర్డును నడిపించడంతో.. జింబాబ్వే 44/0తో పవర్‌ప్లేను ముగించింది. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లోనే మరుమణిని అక్షర్ క్యాచవుట్ చేసి.. టీమిండియాకు బ్రేక్ అందించాడు. అయితే, 9వ ఓవర్‌లో అక్షర్ బౌలింగ్‌లో బెన్నెట్ 6,4,6తో ఒక్కసారిగా గేర్ మార్చాడు. కానీ, మేయర్స్ (6)ను వరుణ్ పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో బెన్నెట్, కెప్టెన్ సికందర్ (31) మూడో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. కావాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోవడంతో.. వీరిద్దరూ ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ప్రయత్నించారు. 15వ ఓవర్‌లో దూబే బౌలింగ్‌లో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 26 పరుగులు రాబట్టిన బెన్నెట్ సెంచరీ దిశగా సాగాడు. కానీ, రజా, బర్ల్ (0)తోపాటు మన్యోంగా (11)ను అర్ష్‌దీప్ వెనక్కిపంపాడు. చివరి ఓవర్‌లో మూసేకివ (7)ను దూబే అవుట్ చేసినా.. 6,4 బాదిన బెన్నెట్ వంద మార్క్‌కు మాత్రం చేరుకోలేక పోయాడు.

### కలసి కొట్టారు..

బ్యాటర్లు సమష్టిగా చెలరేగడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ భారీ స్కోరు చేసింది. టోర్నీలో తొలిసారి ఓపెనర్లు సంజూ శాంసన్ (24) అభిషేక్ శుభారంభాన్ని అందించారు. కిషన్ స్థానంలో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన సంజూ.. మొదటి రెండు ఓవర్లు దాదాపుగా తానే ఎదుర్కోవడంతో శర్మపై ఒత్తిడి తగ్గింది. తొలి ఓవర్‌లోనే 4,6 బాదిన శాంసన్.. ఆ తర్వాత ఓవర్‌లో మరో సిక్స్ కొట్టాడు. 3వ ఓవర్‌లో మపోసా బౌలింగ్‌లో రెండు ఫోర్లు, సిక్స్‌తో టచ్‌లోకి వచ్చిన అభిషేక్.. ఏకంగా 23 పరుగులు రాబట్టాడు. అయితే, భారీ స్కోరు చేస్తాడని భావించిన సంజూ మరోసారి వికెట్ పారేసుకొన్నాడు. ముజరబాని బౌలింగ్‌లో అతడు క్యాచవుట్ కావడంతో.. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్ (38) కూడా రెండు ఫోర్లు బాదడంతో.. పవర్‌ప్లేలో భారత్ 80/1 స్కోరు చేసింది. మధ్య ఓవర్లలో కూడా టీమిండియా బ్యాటర్లు ఇదే జోరు చూపడంతో రన్‌రేట్ ఎక్కడా తగ్గలేదు. 11వ ఓవర్‌లో సికందర్ బౌలింగ్‌లో అభిషేక్ సింగిల్‌తో టోర్నీలో తొలి ఫిఫ్టీ నమోదు చేసినా.. 4,6 కొట్టిన కిషన్ క్యాచవుట్ అయ్యాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 72 పరుగులు జోడించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ (33) బౌండ్రీతో ఖాతా తెరిచాడు. ఇవాన్స్ బౌలింగ్‌లో ముజరబాని క్యాచ్ చేజార్చడంతో బతికిపోయిన సూర్య 4,6తో బ్యాట్‌కు పనిచెప్పాడు. కానీ, అభిషేక్‌ను మపోసా అవుట్ చేసి దెబ్బకొట్టాడు. ధాటిగా ఆడే క్రమంలో సూర్య కూడా వెనుదిరిగాడు.

### పాండ్యా, తిలక్ పోటాపోటీ..

డెత్ ఓవర్లలో పాండ్యా, తిలక్ ఎడాపెడా షాట్లతో.. ఐదో వికెట్‌కు 31 బంతుల్లో 84 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమ్ స్కోరు 250 మార్క్ దాటింది. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండ్రీకి తరలించిన తిలక్.. ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. 17వ ఓవర్‌లో ఇవాన్స్ బౌలింగ్‌లో పాండ్యా ఫోర్ కొట్టగా.. తిలక్ సిక్స్ బాదాడు. వీరిద్దరూ పోటీపడి ఆడడంతో ఆ తర్వాతి రెండో ఓవర్లలో 40 పరుగులు లభించాయి. కాగా, ఆఖరి ఓవర్‌లో పాండ్యా రెండు వరుస సిక్స్‌లతో అర్ధ శతకం పూర్తి చేసుకోవడంతోపాటు గ్రాండ్ ఫినిషింగ్ ఇచ్చాడు.

### మారిన వ్యూహం

తీవ్ర విమర్శల నేపథ్యంలో భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో భారీ మార్పులు చోటు చేసుకొన్నాయి. ఓపెనర్‌గా శాంసన్‌కు చోటివ్వగా.. అక్షర్ పటేల్ టీమ్‌లోకి వచ్చాడు. రింకూ సింగ్, సుందర్‌పై వేటుపడగా.. ఇషాన్ వన్‌డౌన్‌లో, తిలక్ వర్మ మిడిలార్డర్‌లో బరిలోకి దిగారు. లెఫ్ట్-రైట్ కాంబినేషన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకొన్నారు.

# సెమీస్‌కు సఫారీలు

## మార్‌క్రమ్ హాఫ్ సెంచరీ.. బెంబేలెత్తించిన బౌలర్లు



అహ్మదాబాద్: టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా జోరు కొనసాగుతోంది. టోర్నమెంట్‌లో అజేయ రికార్డును కొనసాగిస్తూ ఆరో విజయం అందుకుంది. తొలుత పేసర్లు, ఆపై బ్యాటర్లు అద్భుతంగా రాణించిన వేళ..మెగా టోర్నీలో మరో అజేయ జట్టు వెస్టిండీస్‌కు ఏకంగా తొమ్మిది వికెట్లతో షాకిచ్చింది. ఇంకో రెండు పాయింట్లు ఖాతాలో వేసుకొని సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.. గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలుత కరీబియన్లు 20 ఓవర్లలో 176/8 స్కోరుకే పరిమితమయ్యారు. రొమారియో షెపర్డ్ (37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52 నాటౌట్), జాసన్ హోల్డర్ (31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49) తప్ప అంతా విఫలమయ్యారు. ఎన్‌గిడి మూడు, రబాడ, బాష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో టాపార్డర్ శివాలెత్తడంతో సఫారీలు 16.1 ఓవర్లలో 177/1 స్కోరు చేసి సునాయాసంగా గెలుపొందారు. కెప్టెన్ మార్‌క్రమ్ (46 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 82 నాటౌట్), డికాక్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 47), ర్యాన్ రికెల్టన్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 45 నాటౌట్) దుమ్ము రేపారు. మార్‌క్రమ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

### టాపార్డర్ ఫటాఫట్

ఛేదనలో దక్షిణాఫ్రికా టాపార్డర్ బ్యాటర్లు ధనాధన్ షాట్లతో చెలరేగారు. మార్‌క్రమ్, డికాక్ తొలి బంతి నుంచే విరుచుకు పడడంతో పవర్ ప్లేలో సఫారీలు 69/0తో తిరుగులేని స్థితిలో నిలిచారు. ప్రత్యర్థి పేసర్లు, స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకొని ఆడిన మార్‌క్రమ్, డికాక్ మొదటి వికెట్‌కు 48 బంతుల్లోనే 95 పరుగులు జోడించారు. ఈ దశలో డికాక్ నిష్క్రమించినా..వన్‌డౌన్ బ్యాటర్ రికెల్టన్ కూడా దూకుడు ప్రదర్శించడంతో విండీస్ బౌలర్లకు దిక్కుతోచలేదు. ఇక..సూపర్ ఫామ్‌లో ఉన్న మార్‌క్రమ్ టోర్నీలో మూడో హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మార్‌క్రమ్, రికెల్టన్ రెండో వికెట్‌కు 50 బంతుల్లో అభేద్యంగా 82 పరుగులు జత చేసి జట్టును విజయ తీరాలకు చేర్చారు.

### విండీస్ విలవిల

భారీ హిట్టర్లతో నిండిన వెస్టిండీస్ జట్టు దక్షిణాఫ్రికా పేసర్ల ధాటికి కుదేలైంది. దాంతో 11వ ఓవర్‌కు 83/7 స్కోరుతో కనీసం వంద పరుగులైనా చేయగలుగుతుందా..అనిపించింది. అయితే షెపర్డ్, హోల్డర్ అసమానంగా పోరాడి ఎనిమిదో వికెట్‌కు 89 పరుగులు (57 బంతులు) జోడించడంతో వెస్టిండీస్ పోటీ ఇచ్చే స్కోరు అందుకుంది. షెపర్డ్, హోల్డర్ భాగస్వామ్యం టీ20లలో ఎనిమిదో వికెట్‌కు రికార్డు కావడం విశేషం.

# ఘనంగా అర్జున్ -సానియా ప్రీ వెడ్డింగ్ ఈవెంట్

## వచ్చే నెల 05న జరుగనున్న వివాహం



క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ కుమారుడు అర్జున్ తెందుల్కర్ వివాహం వచ్చే నెల 05న జరగనుంది. అర్జున్ తన స్నేహితురాలు సానియా చందోక్?ను పెళ్లాడనున్నాడు. ఈ క్రమంలో సచిన్ ఇంట పెళ్లి పనులు షురూ అయ్యాయి. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు సెలబ్రిటీలు, రాజకీయ ప్రముఖులకు ఆహ్వాన పత్రిక అందించారు. తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, నీతా అంబానీ జామ్?నగర్?లో అర్జున్ -సానియా ప్రీ వెడ్డింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్?లో సచిన్ ఎమోషనల్ స్పీచ్ ఇచ్చారు. ఈ ఈవెంట్?లో సచిన్ మాట్లాడాడు. తమ కుమారుడి ప్రీ వెడ్డింగ్ ఈవెంట్?ను నిర్వహించినందుకు ముకేశ్ అంబానీ కుటుంబానికి థాంక్స్ చెప్పాడు. 'మమ్మల్ని ఇక్కడికి ఆహ్వానించినందుకు మీకు థాంక్స్. అర్జున్- సానియా జంటను ఆశీర్వదించేందుకు ఇది సరైన వేదిక. ఎప్పుడైతే మన కుమారుడు, ఎవరైనా అమ్మాయిని ఇంటికి తీసుకొచ్చి పరిచయం చేశాడంటే, అప్పుడే కొడుకు పెద్ద వాడయ్యాడని తెలుస్తుంది. వాళ్లు (అర్జున్- సానియా) ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. నిన్ను ప్రేమించే వ్యక్తిని పెళ్లి చేసుకుంటున్నావు. అర్జున్? నిన్ను చూస్తూ గర్విస్తున్నా' అని సచిన్ కుమారుడి పట్ల ఎమోషనల్?గా మాట్లాడాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.'రెండేళ్ల కిందట అనంత్- రాధిక పెళ్లి జరిగిన ఈ జామ్?నగర్?లోనే మళ్లీ అర్జున్- సానియా వివాహ వేడుక కోసం మనం కలుసుకున్నాం. సచిన్- అంజలీ ఎల్లప్పుడూ మా కుటుంబ సభ్యులే. ఈరోజు మీకు ఆతిథ్యం ఇస్తున్నందుకు మాకు సంతోషంగా ఉంది. మా స్కూల్?లో చదువుతున్నప్పటి నుంచి అర్జున్?ను నేను చూస్తున్నా. ఇప్పుడు నీ జీవితంలో ముఖ్యమైన, అందమైన జర్నీని ప్రారంభిస్తున్నావు. సానియా నీ చుట్టూ పాజిటివిటీ ఉంది. మీ ఇద్దరు ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాం' అని నీతా అంబానీ అన్నారు. కాగా, సచిన్ తెందుల్కర్?కు అంబానీ కుటుంబంతో మంచి సంబంధాలు ఉన్నాయి. ముకేశ్?తో సచిన్?కు వ్యక్తిగతంగానూ అనుబంధం ఉంది. ముఖ్యంగా ఐపీఎల్?లో సచిన్ ముంబయి ఇండియన్స్?కు ఆడుతున్నప్పటి నుంచి ఇంకా దగ్గరయ్యారు. తెందుల్కర్ క్రికెట్ నుంచి (2013) రిటైరైన తర్వాత కూడా ఐపీఎల్?లో ముంబయి ఫ్రాంచైజీతోనే కొనసాగుతున్నారు. దశాబ్ద కాలంగా సచినే ముంబయికి మెంటార్?గా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా అర్జున్ తెందుల్కర్ కూడా ముంబయి జట్టుతోనే ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. గతసీజన్?దాకా ముంబయితోనే ఉన్నాడు. అయితే 2026 సీజన్?కుగాను అతడిని లఖ్?నవూ సూపర్ జెయింట్స్ ట్రేడింగ్?లో తీసుకుంది. పెంపుడు జంతువులకు గ్రూమింగ్, వెల్?నెస్ బ్రాండ్ అయిన మిస్టర్ పాప్స్ పెట్ స్పా ఒ స్టోర్ ాూూ వ్యవస్థాపకురాలు సానియా చందోక్. ఆమె 2020లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పట్టా అందుకున్నారు. ఆ తర్వాత వెటర్నరీ టెక్నిషియన్‌గా అర్హత సాధించారు. ఆమె గ్రావిస్ గ్రూప్ చైర్మన్ రవి ఘాయ్ మనవరాలు. ఆమె తల్లిదండ్రులు సన్నీ - గౌరిక కూడా ఈ సంస్థతో సంబంధం కలిగి ఉన్నారు.

## 19 ఏళ్ల టీ20 వరల్డ్ కప్ చరిత్రలో శ్రీలంక చెత్త రికార్డు

టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్ 8 దశలో భాగంగా బుధవారం కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టుకు తీరని అవమానం ఎదురైంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఈ కీలక పోరులో లంక ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవడమే కాకుండా, టీ20 ప్రపంచకప్ 19 ఏళ్ల చరిత్రలోనే ఎన్నడూ లేని ఒక అత్యంత చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది. పరుగుల వేటలో తడబడిన శ్రీలంక ఆటగాళ్లు పవర్‌ప్లేలో చేతులెత్తేయడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.మొదట టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్ ఆరంభంలో చాలా నిలకడగా సాగింది. ఒకానొక దశలో 75 పరుగుల వద్ద కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయిన కివీస్, భారీ స్కోరు సాధించేలా కనిపించింది. అయితే శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో సీన్ రివర్స్ అయింది. కేవలం 9 పరుగుల వ్యవధిలోనే 4 కీలక వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్, 84 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కనీసం 120 పరుగులు చేస్తుందా అని అనుకుంటున్న తరుణంలో కెప్టెన్ మిచెల్ సాంట్నర్, కోల్ మెక్కాన్చీలు అద్భుతం చేశారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు ఏకంగా 47 బంతుల్లో 84 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పి, జట్టు స్కోరును 20 ఓవర్లలో 168/7కి చేర్చారు. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే చుక్కలు కనిపించాయి. కివీస్ బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు క్రీజులో నిలవడానికి నానా తంటాలు పడ్డారు. ఈ క్రమంలోనే టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే శ్రీలంక తన అత్యల్ప పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది. మొదటి 6 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే చేసి 2 వికెట్లు కోల్పోయింది. ఇంతకుముందెన్నడూ లంక ఇంత ఘోరంగా పవర్‌ప్లేలో ఆడలేదు. లక్ష్యం పెద్దదైనప్పుడు ధాటిగా ఆడాల్సింది పోయి, అతి జాగ్రత్తగా ఆడి వికెట్లు పారేసుకోవడం ఆ జట్టు కొంపముంచింది. చివరికి శ్రీలంక జట్టు 20 ఓవర్లలో 107/8 పరుగులకే పరిమితమై 61 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. జట్టులో కామిందు మెండిస్ (31 పరుగులు) మినహా ఎవరూ 30 పరుగుల మార్కును దాటలేకపోయారు. న్యూజిలాండ్ స్పిన్నర్ రచిన్ రవీంద్ర 4 వికెట్లతో లంక పతనాన్ని శాసించాడు. ఈ ఓటమితో శ్రీలంక సెమీఫైనల్ రేసు నుండి అధికారికంగా నిష్క్రమించగా, కివీస్ తన సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది. తన చివరి మ్యాచ్‌లో కూడా గెలిస్తే న్యూజిలాండ్ నేరుగా సెమీస్‌కు చేరుకుంటుంది.

# పర్సనల్ లైఫ్‌లోనూ కియారా సక్సెస్

సినిమా ఇండస్ట్రీలో కొంతమంది హీరోయిన్లు సక్సెస్ ట్రాక్ కంటిన్యూ చేస్తూ పర్సనల్ లైఫ్‌ను కూడా ఎంతో ఎంజాయ్ చేస్తుంటారు. అలా ప్రొఫెషనల్, పర్సనల్ కెరీర్‌లో ఏ లోటూ లేకుండా ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తున్న హీరోయిన్ కియారా అద్వానీ). అందంతో పాటు యాక్టింగ్ టాలెంట్‌తో ప్రేక్షకులకు అట్రాక్ట్ చేసే ఈ నటి ప్రస్తుతం బాలీవుడ్ బిజీ భామల్లో ఒకరిగా మారిపోయింది. హిందీతో పాటు తెలుగులోనూ సినిమాలు చేస్తున్న కియారా.. ఒక పక్క సినిమాలు, యాడ్స్ చేస్తూనే మ-రోవైపు లగ్జరీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. రామ్‌చరణ్ హీరోగా నటించిన 'వినయ విధేయ రామ', గేమ్ ఛేంజర్ సినిమాలతో పాటు మహేశ్ బాబుతో 'భరత్ అనే నేను'లో నటించి తెలుగు ఆడియన్స్‌ని కియారా అద్వానీ దగ్గరైంది. అందంతో పాటు యాక్టింగ్ టాలెంట్ ఆమె సొంతం. 1992, జులై 31న ముంబైలో కియారా జన్మించింది. ఈ బ్యూటీ అసలు పేరు అలియా అద్వానీ. తండ్రి జగదీప్ అద్వానీ బిజినెస్‌మ్యాన్ కాగా, తల్లి జెనీవీవ్ జాఫ్రీ టీచర్. కియారా ముంబైలోని కేథడ్రల్, జాన్ కానన్ స్కూల్‌లో స్కూలింగ్, తర్వాత జై హింద్ కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ డిగ్రీ కంప్లీట్ చేసింది. అయితే ఆమె బంధువులు సినీ ఇండస్ట్రీలో ఉండటంతో చిన్నప్పటి నుంచే బాలీవుడ్ గ్లోరీ, గ్లామర్‌కి అట్రాక్ట్ అయ్యింది.కియారా 2014లో 'ఫగ్లీ' మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 2016లో వచ్చిన స్పోర్ట్స్ బయోపిక్ 'ఎం.ఎస్ ధోనీ : ది అన్‌టోల్డ్ స్టోరీ'లో ఇంపార్టెంట్ క్యారెక్టర్ చేసి సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చింది. లస్ట్ స్టోరీస్‌లో (2018) పోషించిన అన్ సాటిస్‌ఫైడ్ లైఫ్ పార్ట్‌నర్ క్యారెక్టర్‌తో తనలోని టాలెంట్‌ని బయటపెట్టింది. ఇక షాహిద్ కపూర్‌తో కలిసి సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన 'కబీర్ సింగ్'లో ప్రీతి క్యారెక్టర్ హైలెట్. గుడ్ న్యూజ్, షేర్షా, భూల్ భూలైయా 2, జగ్ జగ్ జీయో, సత్యప్రేమ్ కి కథ వంటి మరెన్నో చిత్రాలు చేసింది. డాన్ 3, టాక్సిక్ మూవీల్లోనూ నటిస్తోంది.కియారా కాంటెంపరరీ లైఫ్‌స్టైల్ తన క్యారెక్టర్‌ని రిఫ్లెక్ట్ చేస్తుంది. ఆమె బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను లవ్ మ్యారేజ్ చేసుకుంది. షేర్షా సినిమా షూటింగ్ టైమ్‌లో వీరి మధ్య ప్రేమ చిగురించింది. ఇప్పుడు వీరిద్దరికి కుమార్తె పుట్టింది. ప్రస్తుతం కియారా ఫ్యామిలీ బాంద్రాలో నివసిస్తోంది. ఈమె తన పర్సనల్ లైఫ్ అప్‌డేట్స్‌ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటుంది.







# ఒక్కటైన విజయ్ రష్మిక

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (విరోష్) పెళ్లి వేడుకలు రాజస్థాన్ ఉదయపూర్‌లోని ×ుజ మెమెంటోస్ (ఎకాయా ఉదయపూర్) హోటల్‌లో ఘనంగా జరుగుతున్నాయి. సరిగ్గా ఉదయం 10 గంటల 10 నిమిషాలకు రష్మిక మెడలో విజయ్ దేవరకొండ మూడు ముళ్లు వేసినట్లు సమాచారం. అతికొద్ది మంది అతిథుల సమక్షంలో మేళ తాళాల నడుమ ఈ వేడుక అట్టహాసంగా జరిగిందని తెలుస్తోంది. ఉదయపూర్ ప్యాలెస్ వేదికగా అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు సమక్షంలో వేదమంత్రాల సాక్షిగా విజయ్ దేవరకొండ -- రష్మిక మందన్న ఏడడుగుల బంధంలోకి అడుగు పెట్టారు. దాదాపు 8 సంవత్సరాలుగా డేటింగ్ చేస్తున్న ఈ జంట ఎట్టకేలకు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టి అభిమానులను ఖుషీ చేశారు.విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న వివాహ బంధంతో ఒక్కటి కావడంతో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అటు విజయ్ ఫ్యాన్స్, ఇటు రష్మిక ఫ్యాన్స్ ఖుషీ ఖుషీ అవుతూ ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు.

# అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది

రీసెంట్ డేస్ లో కొంతమంది హీరోయిన్స్ ఓవర్ నైట్ లో స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. ఒకే ఒక్క సినిమాతో పాపులర్ అవుతున్నారు. ఇప్పటికే మన దగ్గర యంగ్ బ్యూటీస్ చాలా మంది. ఒకొక్క సినిమాకు ఒకొక్క హీరోయిన్ పరిచయం అవుతుంది. అయితే ఓ ముద్దుగుమ్మ మాత్రం ఇండస్ట్రీలో నాయా రికార్డ్ క్రియేట్ చేసింది. కేవలం 22ఏళ్ల ఆ ముద్దుగుమ్మ ఇండస్ట్రీని షేక్ చేసింది. ఆమె అందానికి, నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆమె తొలి సినిమానే వందలకోట్ల కలెక్షన్స్ రాబట్టింది. స్టార్ హీరోలు కూడా ఆమె నటనకు, అందానికి ఫ్లాట్ అయ్యారు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇటీవలే బాక్సాఫీస్ వద్ద ఓ సినిమా సంచలనం సృష్టిస్తుంది. ఆ సినిమాతో 22 ఏళ్ల హీరోయిన్ రికార్డ్స్ తిరగరాస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో మారుమోగుతున్న పేరు అనీత్ పద్ద. వయసు 22 సంవత్సరాలు. పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించిన ఈ వయ్యారి.. మోహిత్ సూరి దర్శకత్వం వహించిన సయ్యారా సినిమాతో కథానాయికగా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. జూలై 18న విడుదలైన ఈ సినిమా రూ. 570 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది అనీత్ పద్ద. అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరు ఈ అమ్మడు గురించి తెలుసుకోవడానికి ట్రై చేశారు. అనీత్ పద్ద.. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చేస్తుందట. నటనపై ఆసక్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది అనీత్ పద్ద. ఇప్పటికే పలు యాడ్స్ చేసింది. ఇక సయ్యారా సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయమైంది. ఫస్ట్ మూవీతోనే ఊహించని విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఈ సుందరి.. ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సయ్యారా సినిమాపై చాలా మంది సెలబ్రెటీలు, స్టార్ హీరోలు కూడా ప్రశంసలు కురిపించారు. హీరోహీరోయిన్స్ పై పొగడ్తలు కురిపించారు.



# ఇంతవరకూ ఒక్క హిట్టు పడలేదు

ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామ-రస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ - సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463